# మంత్రి సీతక్క చేసే అభివృద్ధిని ఓర్వలేకనే తప్పుడు ప్రచారాలు

## జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్



**ములుగు జూన్ 23**

ములుగు జిల్లాలో రాష్ట్ర మంత్రి సీతక్క చేసే అభివృద్ధి పనులను ఓర్వలేకనే బిఆర్ఎస్ పార్టీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో కలసి మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ములుగు జిల్లాలో అక్రమ ఇసుక రవాణా మరియు అవినీతి జరుగుతుందన్న బిఆర్ఎస్ నాయకుల తప్పుడు ప్రచారాలను ఖండిస్తూ..ఇసుక సరఫరాలో 4 కోట్ల అవినీతి చేశారన్న బిఆర్ఎస్ నాయకుల మాటలు అవాస్తవం అని,అక్రమ రవాణా జరిగి ఉంటే ఆధారాలతో ఎందుకు ముందుకు రావడం లేదని బిఆర్ఎస్ పార్టీ నాయకులు సీతమ్మ ప్రాజెక్ట్ నిర్మాణంలో ప్రజలు నష్టపోతున్నారని అవాస్తవాలు మాట్లాడం సబబు కాదని, బిఆర్ఎస్ పార్టీ నాయకులు చేస్తున్న తప్పుడు ఆరోపణలు,వాస్తవాలకు సంబంధించిన చీఫ్ ఇరిగేషన్ ఇచ్చిన నది పరివాహక ప్రాంత మ్యాప్ వాటి ఆధారాలతో సహా మీడియా సాక్షిగా వివరించారు. గతంలో మీ బిఆర్ఎస్ పార్టీ 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు ములుగు జిల్లాలో చేయలేని అభివృద్ధి మంత్రి సీతక్క కృషి వల్ల ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయనీ జిల్లాలోని ప్రజలు మంత్రి సీతక్క పై ఆదర అభిమానాలను పొందుతుంటే, మీరు ప్రతిపక్షంలో ఉన్నారు జరుగుతున్న అభివృద్ధికి సహకరించండి అంతే కానీ మంత్రి సీతక్క చేసే అభివృద్ధి పనులకు ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేసి ప్రజల్లో చులకన కావద్దని బిఆర్ఎస్ పార్టీ నాయకులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్,డీసీసీ వైస్ ప్రెసిడెంట్ పల్లె జైపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,పోరిక రాహుల్ నాయక్,సీనియర్ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# మెట్రో కొత్త మలుపు.. (మొదటిపేజీ తరువాయి)

సంస్థలను అన్వేషించి, అనుసంధానం చేయడం ఎస్‌బీఐ క్యాప్స్ బాధ్యత. ఇది రెండు నెలల్లో నివేదిక ఇస్తుంది. రెండు దశలకు అవసరమైన రుణం ఇచ్చే ఆర్థిక సంస్థలను ఎంపిక చేసి, వాటితో సంప్రదింపులు జరిపి, రెండు దశలకు కలిపి రుణం మంజూరుకు మార్గం సుగమం చేస్తుంది. రెండు దశలకు కలిపి రుణం తీసుకోవాలని భావిస్తున్న నేపథ్యంలోనే మరోసారి పాత మెట్రో ఆస్తులు, అప్పుల విలువను మదింపు చేయాలని నిర్ణయించారు. మెట్రో మొదటి, రెండో దశల్లో కూడా వాటాదారుగా ఉంటానని కేంద్రం చెప్పినట్లు విశ్వసనీయంగా తెలిసింది. వాటా ఇచ్చేందుకు తమకేమీ అభ్యంతరం లేదని, ఆస్తులతో పాటు అప్పుల్లోనూ కేంద్రం బాధ్యత తీసుకోవాలని, ఈక్విటీ వాటాదారుగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఈ లెక్కల తర్వాత కేంద్రం వాటా ఎంత అనేది తేలనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణానికి సంబంధించిన వడ్డీ రేట్ల మీద పట్టుబట్టినట్టు సమాచారం. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఐఆర్‌ఎఫ్‌సీ ద్వారా జపాన్ నుంచి 4 శాతం వడ్డీకే రుణం వచ్చేట్లు మాట్లాడుకున్నామని, కొత్త రుణం కూడా ఇదే రేటుతో ఉంటేనే రాష్ట్ర ప్రభుత్వానికి లాభదాయకంగా ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దీనికి కేంద్రమంత్రులు కూడా అంగీకరించినట్టు సమాచారం. హైదరాబాద్ మెట్రో రెండో దశను చేపట్టడానికి నిర్వహణ సంస్థ ఎల్ అండ్ టీ సిద్ధంగా లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం మొత్తం మెట్రోను స్వాధీనం చేసుకోవాలని నిర్ణయం తీసుకుంది. ఫేజ్–1 స్వాధీనానికి రూ. 13,600 కోట్లు అవసరం అయ్యింది. జపాన్ నుంచి ఐఆర్‌ఎఫసీ ద్వారా తీసుకొనేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. నిధులు చివరి దశలో నిలిచి పోయాయి. నిజానికి మొదటి దశ ఆస్తులను, రెండో దశ ఖర్చులను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఐడీబీఐ ద్వారా అంచనా వేయించింది. వాటి ఆధారంగానే ఎల్ అండ్ టీతో ఒప్పందం, జపాన్ రుణం ఖరారయ్యాయి. కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి చర్చల్లో చివరకు మెట్రో మొదటి ఆస్తులను, రెండో దశ విస్తరణ ఖర్చులను మరోసారి మదింపు చేయాలని అంగీకారానికి వచ్చారు. రెండు దశలకు ఒకే సంస్థ/కన్సార్టియం నుంచి రుణం తీసుకోవాలన్న ఆలోచనతో పాటు మొదటి దశ రుణం సజావుగా సాగేందుకు పునర్ మదింపు ఉపయోగ పడుతుందని భావించారు. ఐడీబీఐ గతంలో చేసిన మదింపును కూడా ఎస్‌బీఐ క్యాప్స్ పరిగణనలోకి తీసుకుంటుంది. రెండు దశల ఉమ్మడి విలువను తేల్చడంతో పాటు మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి తీసుకోవడానికి వెంటనే ఎన్ని నిధులు అవసరమో కూడా తేలుస్తారు. ప్రక్రియ మొత్తాన్ని రెండు నెలల్లోపే పూర్తి చేస్తారు. మెట్రో రెండు దశలకు కలిపి ఒకే సంస్థ నుంచి రుణాన్ని మంజూరు చేయించడంతో పాటు వడ్డీ రేటు విషయంలోనూ కేంద్రమే కీలకంగా వ్యవహ రించనుంది. కేంద్ర మంత్రులు 4 శాతం కంటే తక్కువ వడ్డీరేటుకే రుణం ఇప్పించేలా సహకరిస్తామని ముఖ్యమంత్రికి చెప్పినట్లు తెలుస్తోంది. ఆర్థికంగానూ రాష్ట్ర ప్రభుత్వానికి ఇది కొంత ఉపశమనమని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్ర మెట్రోలో భాగస్వామిగా ఉండాలని కేంద్రం గట్టిగా బావిస్తోంది. మెట్రో లో వాటాదారుగా ఉంటానని చెబుతోంది. రెండు దశల మెట్రోల విలువల మదింపు తర్వాత మరోసారి సమావేశమై కేంద్రం వాటాపై చర్చిస్తారు. కేంద్రం ఆస్తులతో పాటు అప్పుల్లో కూడా వాటాదారుగా ఉంటుంది. కేంద్రమే భాగస్వామి కావడంతో రుణం మంజూరు, వడ్డీరేట్లు తేలడం వేగంగా జరుగుతాయని అంటున్నారు.

**ఫీజు రూ.84 కోట్లు వెనక్కి**

తాజా పరిణామాల నేపథ్యంలో జపాన్ రుణం ఆగిపోయినట్లే. ఆ రుణం మంజూరు కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ ఐఆర్‌ఎఫ్‌సీకి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిన రూ. 84 కోట్లను వెనక్కి ఇచ్చేందుకు సదరు సంస్థ అంగీకరించింది. బ్యాంకు ఖాతా నంబరు ఇస్తే నిధులను బదిలీ చేస్తామని కూడా చెప్పింది. ఎల్ అండ్ టీ ఎంఆర్‌హెచ్‌ఎల్ ఇదే రుణం కోసం చెల్లించిన రూ. 11 కోట్లను ఐఆర్‌ఎఫ్‌సీ ఇప్పటికే తిరిగి ఇచ్చేసింది. రెండు దశలను మదించడం కోసం ఐడీబీఐకు చెల్లించిన రూ. 4.6 కోట్లు మాత్రం తిరిగిరావు. తాజా పరిణామాలను వివరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఎల్ అండ్ టీ ప్రతినిధులతో సంప్రదింపులు జరపనుంది.

**సమన్వయానికి ఇద్దరు అధికారులు**

ఎస్‌బీఐ క్యాప్స్ కన్సల్టెన్సీఅధ్యయనం సమయంలో సమన్వయపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక అధికారి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రతినిధులుగా ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ అధికారులు అధ్యయన ప్రక్రియ వేగంగా పూర్తయి నివేదిక ఇచ్చేందుకు కృషి చేస్తారు. సోమవారం కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చర్చలు జరిపిన తర్వాత మంగళవారం ముగ్గురూ వెళ్లి కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. మెట్రో రెండో దశ వేగంగా పూర్తవ్వాలనే ఏకైక లక్ష్యంతో చర్చలు కొనసాగాయి. ఎస్‌బీఐ క్యాప్స్‌కు గతంలో పూనే రింగ్ రోడ్ ప్రాజెక్టు, ముంద్రా పెట్రో కెమ్ ప్రాజెక్టు, పెట్రోనెట్ ఎల్ ఎన్ జి లిమిటెడ్ ప్రాజెక్టు, మహారాష్ట్ర మౌలిక సదుపాయాల అభివృద్ధికి చెందిన యాన్యుటీ ప్రాజెక్టు, డ్రక్ గ్రీన్ పవర్ ప్రాజెక్టుతో పాటు ఆదానీ ఎంటర్ ప్రైజెస్, ఎల్‌ఐసీ, హాల్దియా పెట్రో కెమికల్స్, జియో ప్లాట్ ఫారమ్స్ కు సంబంధించిన వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులను ఎస్‌బీఐ క్యాప్స్ పర్యవేక్షిస్తోంది.

# గొడ్డలి పార్టీ కులం కుట్రలు... (మొదటిపేజీ తరువాయి)



ఆమె మృతదేహాన్ని ఊరిలోకి తీసుకొచ్చేందుకు గ్రామస్థులు అంగీకరించలేదు. ఈ కేసులో నిందితులకు వైసీపీ అండదండలున్నాయి. ఊరంతా వద్దన్న విషయాన్ని వైసీపీ నేతలు తలకెత్తుకున్నారు. ఇలాంటి క్రిమినల్ మనస్తత్వం ఆ పార్టీలోనే కనిపిస్తుంది’ అని చంద్రబాబు వివరించారు. కృష్ణలంకకు చెందిన సాయికృష్ణ ఘటనలోనూ వైసీపీ అదే తరహాలో ప్రవర్తిస్తోందని, ప్రభుత్వ చిత్తశుద్ధిని సాయికృష్ణ తల్లి, బంధువులు నమ్ముతుంటే గొడ్డలి పార్టీ కుల రాజకీయం చేస్తోందని సీఎం ధ్వజమెత్తారు. కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో శాంతిభద్రతలు చాలా వరకు అదుపులో ఉన్నాయని.. కానీ వైసీపీ ఏ చిన్న ఘటన దొరికినా దాన్ని రాజకీయ లబ్ధికి వాడుకోవాలని చూస్తోంద న్నారు. వైసీపీ కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని సహచరులకు సూచించారు. ఆ పార్టీ దుష్ప్రచారాలపై విమర్శలు చేయడం కన్నా.. ప్రజలకు వాస్తవాలు తెలియజేయడంపై దృష్టి పెట్టాలని కోరారు.రాజధాని అమరావతిలో ఏర్పాటు చేసే ఫైవ్‌స్టార్ హోటళ్లకు పన్ను రాయితీల అంశం చర్చకు వచ్చినప్పుడు మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందిస్తూ.. హోటళ్ల యాజమా న్యాలకు పన్ను రాయితీలు ఇవ్వడం కన్నా నేరుగా వినియోగదారులకు లబ్ధి చేకూరేలా రాయితీలు కల్పిస్తే బాగుంటుందని సూచించారు. సీఎం స్పందిస్తూ.. రాజధానిలో పెద్ద హోటళ్లు రావాలంటే పన్ను రాయితీలు కల్పించాల్సిందేనని.. లేకుంటే అమరావతిలో హోటళ్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం వారికి ఏముంటుందని ప్రశ్నించారు. చంద్రబాబుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పర్యాటక మంత్రి దుర్గేశ్ మద్దతు పలికారు. గీతం విద్యాసంస్థలో 45మీ. ఎత్తు వరకు స్కూల్ భవన నిర్మాణం చేపట్టేందుకు తాత్కాలిక ఫైర్ ఎన్‌వోసీ మంజూరుకు సంబంధించిన అంశం చర్చకు వచ్చిన సమయంలో.. చంద్రబాబు, లోకేశ్ బయటకు వెళ్లారు. తమ ప్రమేయం లేకుండా మంత్రివర్గ సహచరులు నిర్ణయించాలని సీఎం సూచించారు. ఈ అంశానికి క్యాబినెట్ ఆమోదించింది.విశాఖలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆధ్వర్యంలో ఓ డేటా సెంటర్ ఏర్పాటుకు రంగం సిద్ధమైందని, త్వరలో వివరాలు వెల్లడిస్తామని సీఎం తెలిపారు.డేటా సెంటర్ల నీటివాడకం, విద్యుత్ వాడకంపైనా వైసీపీ పథకం ప్రకారం దుష్ప్రచారం చేస్తోందని లోకేశ్ అన్నారు. వాస్తవాలతో వాటిని తిప్పికొట్టాలని కోరారు. పవన్ కల్యాణ్ జోక్యం చేసుకుని.. ఎకరా సాగుకు ఎంత నీరు అవసరమని ప్రశ్నించారు. డేటా సెంటర్‌కు ఎంత నీరు అవసరమని అడిగారు. సాగుకు ఇబ్బంది లేకుండా సముద్రంలో కలిసే వృథా జలాలనే డేటా సెంటర్లకు వాడుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని సీఎం ఆయనకు వివరించారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠినంగా ఉండాలని పలువురు మంత్రులు సీఎంకు సూచిం చారు. వైఎస్ కుటుంబం రాయలసీమకు ఉక్కు కర్మాగారం అంటూ ఏళ్ల తరబడి ఊరిస్తూ వచ్చిందని.. కూటమి దానిని సాకారం చేయనుందని సీఎం తెలిపారు. జూలై 3న కడప స్టీల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయబోతున్నామని క్యాబినెట్ సహచరులతో చెప్పారు. ‘ప్రతి మంత్రీ అన్ని శాఖలపై అవగాహన పెంచుకోవాలి. తమ శాఖ పరిధిలోని అంశం కాదని కూర్చోకుండా ప్రతి అంశంపై స్పందించాలి. డీఎస్సీ సహా వివిధ అంశాలపై చేసే అసత్యప్రచా రాలను మంత్రులంతా దీటుగా తిప్పికొట్టాలి. కర్నూలు జిల్లా జొన్నగిరి గ్రామాన్ని స్వర్ణగిరి అనే పేరుతో పిలవాలి. త్వరలో దీనికి సంబంధించిన అధికారిక కార్యక్రమాన్ని పూర్తి చేద్దాం’ అని తెలిపారు. క్యాబినెట్ భేటీ అనంతరం మంత్రులతో కలిసి లోకేశ్ డిన్నర్ చేశారు. ఈ సందర్భంగా.. సర్ జరిగే సమయంలో ‘ఇంటింటికీ టీడీపీ’ కార్యక్రమం నిర్వహించడం ఇబ్బందిగా ఉంటుందని పలువురు మంత్రులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అధినేత చంద్రబాబుతో మాట్లాడి జూలై 15కి వాయిదా వేద్దామని లోకేశ్ చెప్పారు. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. గురువారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాల్సి ఉంది.

# కేంద్ర మంత్రివర్గ... (మొదటిపేజీ తరువాయి)

క్యాబినెట్ భేటీలో పార్లమెంట్ సమావేశాలపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. కాగా, కేరళకు చెందిన కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జి కురియన్ బుధవారం తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. రాజ్యసభ పదవీకాలం ఈ నెల 21న ముగిసింది. ఆయనను కేంద్రం తిరిగి నామినేట్ చేయలేదు. మరోవైపు రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ రాజ్యసభ పదవీకాలం కూడా ఈ నెల 21నే ముగియగా.. ఆమెను కూడా రాజ్యసభకు తిరిగి ఎంపిక చేయలేదు. ఇక కేంద్ర రవాణా, రహదారులు, కార్పొరేట్ వ్యవహారాల సహాయ మంత్రి హర్ష మల్హోత్రాను గత నెలలో ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా నియమించారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరికి చాలా కాలం క్రితమే ఉత్తరప్రదేశ్ రాష్ట్ర బీజేపీ బాధ్యతలు అప్పగించారు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో మంత్రివర్గంలో మరికొందరికి ఉద్వాసన తప్పదని, చాలా మంది కొత్తవారికి అవకాశాలు కల్పిస్తారని చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఈసారి కేంద్ర మంత్రివర్గంలో 33 శాతం మహిళలకు తప్పక అవకాశం లభిస్తుందనే చర్చ మొదలైంది. దీంతో పలు రాష్ట్రాలకు చెందిన మహిళా ఎంపీలు ఇప్పటికే ఢిల్లీ పెద్దలతో సంప్రదింపులు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది.కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు ముందే పార్టీ పునర్వ్యవస్థీకరణపై కూడా బీజేపీ అధిష్ఠానం దృష్టి సారించింది. జీ7 సమావేశాలు పూర్తి కాగానే ఢిల్లీకి వచ్చిన ప్రధాని మోదీ.. రెండురోజుల క్రితం లూధియానాలో ఉన్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్‌ను ఆగమేఘాలపై ఢిల్లీకి పిలిపించారు. రెండు రోజులుగా పార్టీలో ఆఫీసు బేరర్లు, కార్యవర్గ సభ్యుల పై ఆయన సమాలోచనలు జరిపినట్లు తెలిసింది.

**కీలక రాష్ట్రానికి గవర్నర్‌గా కురియన్?**

కేంద్ర సహాయ మంత్రి జార్జి కురియన్ హఠాత్తుగా పదవి నుంచి తప్పుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం కేంద్ర క్యాబినెట్‌లో ఏకైక క్రైస్తవ మంత్రి కురియన్ మాత్రమే. దీనిపై కురియన్ సోషల్ మీడియాలో స్పందించారు. నరేంద్ర మోదీ ప్రధాని కావడం వల్లే తనకు కేంద్ర మంత్రి పదవి దక్కిందని, ఇది తాను కలలో కూడా ఊహించని అవకాశం అని పేర్కొన్నారు. కాగా, దేశంలో ఏదో ఒక కీలక రాష్ట్రానికి గవర్నర్‌గా నియామకం కోసం కురియన్ పేరు పరిశీలనలో ఉండే అవకాశం ఉందని అంటున్నారు.

# కొలీజియం నిర్ణయాలపై కోర్టులు జోక్యం చేసుకోలేవు

**ఆర్టీఐ కింద సమాచారమూ కుదరదు**

**జడ్జిల ఎంపికపై సుప్రీంకోర్టు స్పష్టీకరణ**



**న్యూఢిల్లీ, జూన్ 23:** హైకోర్టు, సుప్రీంకోర్టు కొలీజియాల నిర్ణయాల్లో జోక్యం చేసుకోలేమని సుప్రీం కోర్టు పునరుద్ఘాటించింది. జడ్జిల ఎంపిక ప్రక్రియ న్యాయస్థానాల సమీక్షకు, ఆర్టీఐ చట్టానికి పూర్తిగా అతీతమైనదని తేల్చిచెప్పింది. హైకోర్టు జడ్జిలను ఎలా ఎంపిక చేశారు? ఎవర్ని ఎందుకు తీసుకున్నారు అనే విషయాలను కోర్టుల్లో కేసులేసి ప్రశ్నించలేమని, ఆర్టీఐ చట్టం కింద దరఖాస్తులు పెట్టి తెలుసుకోవడం కుదరదని స్పష్టం చేసింది. ఈ మేరకు హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన జిల్లా జడ్జి అరవింద్ మల్హోత్రా వేసిన పిటిషన్‌ను సోమవారం తోసిపుచ్చింది. సీనియర్‌ను అయిన తనను కాదని, జూనియర్ల పేర్లను హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు కొలీజియం సిఫార్సు చేసిందని ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ నాగరత్న, జస్టిస్ బాగ్చీ ధర్మాసనం దీనిపై స్పందిస్తూ, జడ్జిల ఎంపిక పూర్తిగా కమిటీ వ్యక్తిగత అంచనాపై ఆధారపడి ఉంటుందని చెప్పింది. జడ్జిల ఎంపిక ప్రక్రియను కోర్టులు సమీక్షించడం మొదలుపెడితే అందరూ కోర్టును ఆశ్రయిస్తారని, దానికి అంతూ పొంతూ ఉండదని ఆందోళన వ్యక్తం చేసింది. న్యాయమూర్తిగా ఎంపికకు సీనియారిటీ ఒక్కటే ప్రాతిపదిక కాదని, కొలీజియం ఒక పేరును ఆమోదించాక దానిపై పునరాలోచన ఉండదని చెప్పింది. మల్హోత్రాకు ఇంకా పదేళ్ల సర్వీసు ఉందని, ఆయన ఓపిగ్గా ఎదురు చూడాలని సలహా ఇచ్చింది.

# మా పెద్దన్న బీజేపీ అధికార ప్రతినిధి

**- ఈ విషయం ముందే చెబుతున్నా**

**- మమతా బెనర్జీ ఎన్నికల పిటిషన్‌పై విచారణ సందర్భంగా కలకత్తా హైకోర్టు జడ్జి వ్యాఖ్య**

**- అభ్యంతరమేమీ లేదన్న మమత లాయర్**



**కోల్‌కతా, జూన్ 23:** భబానీపూర్ నియోజకవర్గం ఎన్నిక ఫలితాన్ని సవాలు చేస్తూ మాజీ సీఎం మమత దాఖలు చేసిన ఎలక్షన్ పిటిషన్‌పై తొలిరోజైన మంగళవారం ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. తన కుటుంబ సభ్యులకు అధికార పార్టీతో సంబంధం ఉన్నందున తాను కేసును చేపట్టవచ్చా అని స్వయంగా న్యాయమూర్తే ప్రశ్నించగా, జడ్జిపై సంపూర్ణమైన విశ్వాసం ఉందని మమత తరఫు న్యాయవాది చెప్పడం ఆసక్తి కలిగించింది. కేసును స్వీకరించిన జస్టిస్ గౌరాంగ్ కాంత్ తొలుత మాట్లాడుతూ తన పెద్దన్న బీజేపీ జాతీయ అధికారిగా పనిచేస్తున్నారని, దీనిపై ఏమైనా అభ్యంతరం ఉందా అని ప్రశ్నించారు. తరువాత ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ముందుగానే ఈ విషయాన్ని చెబుతున్నానని అన్నారు. మమత తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది, టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ సమాధానమిస్తూ తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని చెప్పారు. న్యాయమూర్తిపై తమకు సంపూర్ణమైన విశ్వాసం, గౌరవం ఉందని తెలిపారు. న్యాయం కోసం వచ్చామని, వ్యక్తులు ఎవరన్నది తమకు ముఖ్యం కాదని అన్నారు. దాంతో ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, కౌంటింగ్ రోజునాటి సీసీటీవీ కెమేరా ఫుటేజీలను భద్రపరచాలని సంబంధిత అధికారులకు న్యాయమూర్తి ఆదేశించారు. కేసుపై విచారణ ముగిసే వరకు జిల్లా ఎన్నికల అధికారి వద్ద వాటిని భద్రపరచాలని, ఎలాంటి మార్పులు, చేర్పులు చేయకూడదని ఆదేశించారు. భబానీపూర్‌లో ఓట్ల లెక్కింపులో 12వ రౌండ్ తరువాత నుంచి అక్రమాలు జరిగాయని కల్యాణ్‌బెనర్జీ కోర్టుకు తెలిపారు. తొలుత మమత ఆధిక్యంలో ఉండగా, ఆ రౌండ్ తర్వాత సువేందు మెజార్టీ అనూహ్యంగా పెరిగిందన్నారు.

# అసెంబ్లీలో విజయ్-ఉదయనిధి మధ్య మాటల యుద్ధం

**- వ్యక్తిగత వ్యాఖ్యలతో వేడెక్కిన తమిళనాడు రాజకీయాలు**

**- రైతులు, నీట్, హిందీ వివాదాలపై ఘర్షణ**

**- సభలో తీవ్ర దుమారం రేపిన పరస్పర విమర్శలు**



**చెన్నై, జూన్ 23**

తమిళనాడు అసెంబ్లీలో అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ముఖ్యమంత్రి విజయ్, ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ మధ్య జరిగిన మాటల యుద్ధం సభలో ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. విధానపరమైన విమర్శలతో ప్రారంభమైన చర్చ వ్యక్తిగత ఆరోపణల వరకు వెళ్లడంతో సభలో గందరగోళం నెలకొంది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ హిందీ వివాదం, నీట్ పరీక్ష, రైతుల ఆందోళనలు, కరూర్ తొక్కిసలాట వంటి అంశాలను ప్రస్తావించారు. రైతులను ప్రతిపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. అలాగే గత డీఎంకే ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని, కుటుంబ రాజకీయాలను ప్రోత్సహించిందని విమర్శించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ నాయకత్వంపై కూడా విజయ్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తోందని, ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఒక కుటుంబానికే పరిమితమైన రాజకీయాలు తమ విధానం కాదని, రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సమానంగా సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం మాట్లాడిన ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ ముఖ్యమంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రైతుల సమస్యలను చిన్నచూపు చూడటం సరికాదని, రైతుల నిరసనలకు ప్రతిపక్షాలను బాధ్యులను చేయడం అన్యాయమని అన్నారు. ప్రభుత్వ విధానాల పట్ల ప్రజల్లో అసంతృప్తి ఉండటమే ఆందోళనలకు కారణమని పేర్కొన్నారు. ఉదయనిధి తన ప్రసంగంలో ముఖ్యమంత్రి విజయ్ వ్యక్తిగత జీవితాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ చేసిన వ్యాఖ్యలు సభలో తీవ్ర దుమారానికి దారితీశాయి. వ్యక్తిగత అంశాలను రాజకీయ చర్చల్లోకి తీసుకురావడంపై అధికార పార్టీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తమిళనాడు రాజకీయాల్లో ఇప్పటికే హిందీ వివాదం, నీట్ పరీక్ష, రైతుల సమస్యలు, అభివృద్ధి అంశాలపై తీవ్ర చర్చ జరుగుతున్న నేపథ్యంలో అసెంబ్లీలో జరిగిన ఈ తాజా పరిణామాలు మరింత రాజకీయ వేడిని పెంచాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య ఆరోపణలు–ప్రత్యారోపణలు రాబోయే రోజుల్లో మరింత ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# దేశంలో 109 కోట్లకు చేరిన ఇంటర్నెట్ వినియోగదారులు

**- టెలికాం రంగంలో అప్రతిహత వృద్ధి**

**- మూడు నెలల్లో 6.24 శాతం పెరిగిన ఇంటర్నెట్ సబ్‌స్క్రైబర్లు**

**- ట్రాయ్ నివేదికలో వెల్లడి**




**న్యూఢిల్లీ, జూన్ 23**

దేశ టెలికాం రంగం వేగవంతమైన వృద్ధిని కొనసాగిస్తున్నట్లు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) తాజా నివేదిక వెల్లడించింది. 2026 మార్చి నాటికి దేశంలో మొత్తం ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య 109.27 కోట్లకు చేరిందని ట్రాయ్ పేర్కొంది. 2025 డిసెంబర్ చివరి నాటికి 102.86 కోట్లుగా ఉన్న ఈ సంఖ్య కేవలం మూడు నెలల్లోనే 6.24 శాతం పెరగడం విశేషం. ట్రాయ్ గణాంకాల ప్రకారం మొత్తం ఇంటర్నెట్ వినియోగదారుల్లో 104.62 కోట్ల మంది వైర్‌లెస్ సేవల ద్వారా ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్నారు. మరో 4.65 కోట్ల మంది వైర్డ్ కనెక్షన్లను ఉపయోగిస్తున్నారు. మొబైల్ ఆధారిత ఇంటర్నెట్ సేవల వినియోగం దేశవ్యాప్తంగా మరింత విస్తరిస్తున్నట్లు ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. బ్రాడ్‌బ్యాండ్ సేవల వినియోగం కూడా గణనీయంగా పెరిగింది. దేశంలో బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారుల సంఖ్య 106.58 కోట్లకు చేరుకోగా, న్యారోబ్యాండ్ వినియోగదారులు 2.69 కోట్లుగా నమోదయ్యారు. గత త్రైమాసికంతో పోలిస్తే బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 5.81 శాతం పెరగడం డిజిటల్ సేవల విస్తరణకు నిదర్శనంగా నిలుస్తోంది. ఇంటర్నెట్ సేవలతో పాటు టెలిఫోన్ వినియోగదారుల సంఖ్య కూడా పెరిగింది. దేశంలో మొత్తం టెలిఫోన్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 133.05 కోట్లకు చేరినట్లు ట్రాయ్ తెలిపింది. దీంతో ప్రతి 100 మందికి ఉన్న ఫోన్ కనెక్షన్ల సంఖ్యను సూచించే టెలి–డెన్సిటీ 91.74 శాతం నుంచి 93.26 శాతానికి పెరిగింది. వైర్‌లైన్ టెలి–డెన్సిటీ కూడా స్వల్పంగా మెరుగుపడింది. టెలికాం సంస్థల ఆదాయంలో కూడా వృద్ధి నమోదైంది. వైర్‌లెస్ సేవలకు సంబంధించి వినియోగదారుడి నుంచి వచ్చే సగటు నెలవారీ ఆదాయం (ఏఆర్‌పీయూ) రూ.196.04కు చేరింది. ఇది త్రైమాసిక ప్రాతిపదికన 0.76 శాతం, వార్షిక ప్రాతిపదికన 7.15 శాతం పెరుగుదలగా ట్రాయ్ పేర్కొంది. వినియోగదారుల సగటు మాట్లాడే సమయం కూడా నెలకు 1,017 నిమిషాలకు పెరిగింది. టెలికాం రంగం వృద్ధి ప్రభుత్వ ఆదాయానికి కూడా ఊతమిచ్చింది. 2026 మార్చితో ముగిసిన త్రైమాసికంలో టెలికాం కంపెనీల నుంచి లైసెన్స్ ఫీజుల రూపంలో ప్రభుత్వానికి రూ.6,936 కోట్ల ఆదాయం లభించింది. అలాగే దేశంలో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అనుమతి పొందిన 917 ప్రైవేట్ శాటిలైట్ టెలివిజన్ ఛానెళ్లు కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ట్రాయ్ తన నివేదికలో వెల్లడించింది.

# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి వర్గాన్ని మోసం చేసింది: హరీష్ రావు

**- అశ్వారావుపేట బీఆర్ఎస్ సమావేశంలో ప్రభుత్వంపై విమర్శలు**

**- కేసీఆర్ పాలనను గుర్తు చేసిన మాజీ మంత్రి**

**- రైతులు, గిరిజనులు, దళితులకు అన్యాయం జరిగిందని ఆరోపణ**



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 23**

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని రైతులు, గిరిజనులు, దళితులు, బలహీన వర్గాలతో సహా ప్రతి వర్గాన్నీ మోసం చేసిందని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజల్లో ఇప్పటికీ కేసీఆర్ నాయకత్వంపై విశ్వాసం ఉందని హరీష్ రావు పేర్కొన్నారు. అచ్చంపేట నుంచి అశ్వారావుపేట వరకు ఎక్కడికి వెళ్లినా మళ్లీ కేసీఆరే రావాలనే అభిప్రాయం వినిపిస్తోందన్నారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా ప్రజల అవసరాలను గుర్తించి కళ్యాణలక్ష్మి, రైతుబంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ జరగలేదని, రైతుబంధు పథకాన్ని నిలిపివేశారని ఆరోపించారు. గతంలో పంటలు దెబ్బతింటే ఎకరాకు పరిహారం ఇస్తామని ప్రకటించినా ఇప్పటికీ రైతులకు నష్టపరిహారం అందలేదని అన్నారు. గిరిజనులు, దళితుల సంక్షేమానికి సంబంధించిన నిధులను ప్రభుత్వం విడుదల చేయలేదని హరీష్ రావు పేర్కొన్నారు. ఎస్టీ, ఎస్సీ కార్పొరేషన్లకు బడ్జెట్‌లో వేల కోట్లు కేటాయించినట్లు ప్రకటించినప్పటికీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. గిరిజన విద్యార్థులకు, యువతకు గతంలో అందించిన అవకాశాలు ఇప్పుడు కనిపించడం లేదన్నారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ అభివృద్ధి పనుల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు పనులు నెమ్మదిగా సాగుతున్నాయని, అశ్వారావుపేటలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం ఇంకా పూర్తి కాలేదని పేర్కొన్నారు. జిల్లాకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో పోలీసుల వ్యవహార శైలిపై కూడా హరీష్ రావు విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ కార్యకర్తలను ఇబ్బంది పెట్టే చర్యలను పార్టీ గమనిస్తోందని, ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం సరికాదన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై మరింత బలంగా పోరాడుతామని, ప్రజల మద్దతుతో బీఆర్ఎస్ మళ్లీ బలంగా ముందుకు వస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.



# న్యాయరంగంలో ఏఐ సంచలనం

**- కోర్టు కేసు గెలిచిన కృత్రిమ మేధ ఆధారిత సంస్థ**

**- తక్కువ ఖర్చుతో న్యాయసేవలకు కొత్త దారి**

**- బ్రిటన్‌లో చరిత్ర సృష్టించిన గార్‌ఫీల్డ్ ఏఐ**



**లండన్, జూన్ 23**

కృత్రిమ మేధ సాంకేతికత న్యాయరంగంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. బ్రిటన్‌కు చెందిన గార్‌ఫీల్డ్ ఏఐ అనే కృత్రిమ మేధ ఆధారిత న్యాయసేవల సంస్థ కోర్టు కేసులో విజయం సాధించి చరిత్ర సృష్టించింది. ప్రపంచంలోనే ఏఐ ఆధారిత న్యాయసంస్థ ప్రత్యక్షంగా విజయం సాధించిన తొలి కేసుగా దీనిని విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. ఫ్రీలాన్స్ మానవ వనరుల నిపుణురాలు టామిరెస్ కమల్ టాక్విడిర్‌కు ఒక హాస్పిటాలిటీ సంస్థ చెల్లించాల్సిన ఫీజులను ఇవ్వకపోవడంతో ఆమె గార్‌ఫీల్డ్ ఏఐ సేవలను ఆశ్రయించారు. సుమారు 400 పౌండ్లు చెల్లించి న్యాయసహాయం పొందినట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించిన పత్రాలు, సాక్ష్యాలు, వాంగ్మూలాలు, న్యాయపరమైన పత్రాలన్నింటినీ ఏఐ సాయంతో సిద్ధం చేశారు. విచారణ సమయంలో కోర్టు నిబంధనల ప్రకారం ఒక మానవ న్యాయవాదిని వాదనలు వినిపించేందుకు నియమించారు. లండన్‌లోని వాండ్స్‌వర్త్ కౌంటీ కోర్టులో దాదాపు మూడు గంటల పాటు విచారణ జరిగింది. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం కోర్టు తీర్పును వెలువరించింది. టామిరెస్ కమల్ టాక్విడిర్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చిన కోర్టు ఆమెకు 7,000 పౌండ్లు చెల్లించాలని ప్రత్యర్థి సంస్థను ఆదేశించింది. అలాగే ఆ సంస్థ దాఖలు చేసిన కౌంటర్ క్లెయిమ్‌ను కూడా కొట్టివేసింది. దీంతో గార్‌ఫీల్డ్ ఏఐకు ఇది కీలక విజయంగా నిలిచింది. ఈ విజయాన్ని గార్‌ఫీల్డ్ ఏఐ సహ వ్యవస్థాపకుడు ఫిలిప్ యంగ్ న్యాయరంగంలో ఒక చారిత్రక ఘట్టంగా అభివర్ణించారు. కృత్రిమ మేధ సాయంతో న్యాయసేవలు మరింత వేగంగా, తక్కువ ఖర్చుతో సామాన్య ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం గార్‌ఫీల్డ్ ఏఐ సంస్థ 10 వేల పౌండ్ల వరకు విలువైన చిన్న క్లెయిమ్ కేసులను స్వీకరిస్తోంది. ఈ పరిణామం భవిష్యత్తులో న్యాయరంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి కొత్త దిశను చూపిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కృత్రిమ మేధ ఆధారిత న్యాయసేవలు ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# 28న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమం పై సిబ్బందికి శిక్షణ



**లక్షెట్టిపేట జూన్23(మన సమాజం)**

లక్షెట్టిపేట మండలం లోని వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈనెల 28 న జరగనున్న పల్స్ పోలియో వాక్సినేషన్ కార్యక్రమం నిర్వాహణపై సిబ్బందికి మంగళవారం నాడు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు వైద్యాధికారిని డాక్టర్ సమత తెలిపారు. ఈనెల 28 న ఆదివారం నాడు మండలం లోని 0 – 5 సంవత్సరాల పిల్లలు 3603 మందికి పోలియో వాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. మొదటి రోజు ప్రభుత్వ పాఠశాలల్లో , గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో, అంగన్వాడి కేంద్రాల్లో బూత్ లను ఏర్పాటు చేసి పిల్లలకు పోలియో వాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. అలాగే రెండవ రోజు,మూడవరోజు మా సిబ్బంది ఇంటింటికి వెళ్లి పిల్లలను గుర్తించి వారికి వాక్సిన్ వేసి వందశాతం లక్ష్యం పూర్తి చేస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ స్పెషల్ పల్స్ పోలియో వాక్సిన్ కార్యక్రమం లో 0 – 5 సంవత్సరాల లోపు పిల్లలకు తల్లిదండ్రులు తప్పకుండా వాక్సిన్ వేయించాలని డాక్టర్ సమత కోరారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందికి కార్యక్రమం పై పలు సూచనలు అందించారు. ఈ శిక్షణా కార్యక్రమం లో హెచ్ఈఓ దేవేందర్, హెల్త్ సూపర్ వైజర్ శోభ, ఫార్మసీ ఆఫీసర్ సుష్మ, హెల్త్ అసిస్టెంట్లు గఫూర్, వేణు, ఇసాక్ అహ్మద్, ఎంఎల్ హెచ్ పీ లు ,ఏఎన్ఎంలు, ఆశావర్కర్స్ పాల్గొన్నారు.





# మీకు ప్రామిస్ చేస్తున్నా!..

బాలీవుడ్ ఇండస్ట్రీలో ఫైర్‌బ్రాండ్‌గా పేరు తెచ్చుకుంది అగ్ర కథానాయిక కంగనా రనౌత్. ఏ విషయంలోనైనా నిర్మొహమాటంగా తన మనసులోని భావాల్ని వ్యక్తం చేయడం ఈ భామ నైజం. దాంతో ఎప్పుడూ వివాదాలతో సహవాసం చేస్తుంటుంది. తాజాగా ఆమె వీడియో ఒకటి నెట్టింట వైరల్‌గా మారింది. అందులో కంగనారనౌత్ మెడలో మంగళసూత్రం, చేతులకు గాజులు ధరించి వివాహితలా కనిపిస్తున్నది. దీంతో ఆమె సీక్రెట్‌గా పెళ్లి చేసుకుందనే వార్తలు గుప్పుమన్నాయి. తాజాగా వీటిపై ఆమె క్లారిటీనిచ్చింది. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఓ పోస్ట్ పెట్టింది. 'నేను షూటింగ్‌లో క్యారెక్టర్ మేకప్‌తో ఉండగా ఎవరో ఈ ఫొటో తీశారు. గత కొన్ని రోజులుగా నా పెళ్లి గురించి ఆరాతీస్తూ ఫోన్ కాల్స్ వస్తున్నాయి. నటులు అన్ని రకాల పాత్రలు చేయాల్సి ఉంటుంది. గెటప్‌ని చూసి పెళ్లయిపోయిందని అనుకుంటున్నారు. నేను మీ అందరికి ప్రామిస్ చేస్తున్నా. ఎట్టిపరిస్థితుల్లో రహస్యంగా పెళ్లి చేసుకోను. మీ అందరికి చెప్పే పెళ్లి చేసుకుంటా' అని కంగనా రనౌత్ తన పోస్ట్‌లో పేర్కొన్నది. ప్రస్తుతం ఈ భామ 'క్వీన్-2' షూటింగ్‌లో ఉంది. ఈ సినిమాలోని పాత్రకోసమే వివాహిత గెటప్‌లో కనిపించిందని సమాచారం.



# పెళ్లి అయ్యిందని చెప్పడంతో చేజారిన సినిమా ఛాన్స్..


## షాకింగ్ విషయాలు బయటపెట్టిన స్రవంతి

గ్లామర్ ఇండస్ట్రీలో పెళ్లి, రిలేషన్‌షిప్‌లు నటీమణుల కెరీర్‌పై ప్రభావం చూపుతాయనే చర్చ చాలా కాలంగా కొనసాగుతోంది. ముఖ్యంగా హీరోయిన్లు, యాంకర్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులుగా రాణించాలనుకునే మహిళలకు వ్యక్తిగత జీవితం కూడా కొన్ని సందర్భాల్లో కెరీర్‌పై ప్రభావం చూపుతుందనే అభిప్రాయాలు వినిపిస్తుంటాయి. తాజాగా ఈ అంశంపై ప్రముఖ తెలుగు యాంకర్, బిగ్ బాస్ ఫేమ్ స్రవంతి చొక్కారపు చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న స్రవంతి తన కెరీర్ ప్రారంభ రోజుల్లో ఎదురైన ఒక సంఘటనను పంచుకుంది. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఓ పెద్ద ప్రాజెక్ట్ కోసం ఆడిషన్స్ ఇచ్చానని, నటన, లుక్స్ పరంగా తాను ఎంపికయ్యాననే సంకేతాలు కూడా వచ్చాయని తెలిపింది. మేకర్స్ తనను ఆ పాత్రకు సరైన ఎంపికగా భావించారని చెప్పింది. అయితే ఫైనల్ చర్చల సమయంలో తన వ్యక్తిగత జీవితం గురించి ప్రశ్నలు వచ్చాయని, తనకు పెళ్లైందా అని అడిగారని వెల్లడించింది. దానికి తాను ఎలాంటి సంకోచం లేకుండా "అవును, నాకు పెళ్లైంది" అని నిజాయితీగా సమాధానం చెప్పానని తెలిపింది. కానీ ఆ విషయం చెప్పిన వెంటనే పరిస్థితి పూర్తిగా మారిపోయిందని స్రవంతి పేర్కొంది. షూటింగ్ కోసం చెన్నై రావాలని, అక్కడ అడ్వాన్స్ తీసుకోవాలని ముందుగా చెప్పినట్లు గుర్తు చేసుకుంది. అయితే పెళ్లి విషయం తెలిసిన తర్వాత కొద్దిసేపట్లో కాల్ చేస్తామని చెప్పిన వారు తిరిగి స్పందించలేదని తెలిపింది. ఆ తర్వాత ఆ సినిమా అవకాశం తనకు రాలేదని, తర్వాత ఆ ప్రాజెక్ట్ కూడా ఆగిపోయిందని తెలిసిందని చెప్పుకొచ్చింది. స్రవంతి చొక్కారపు చిన్న యూట్యూబ్ ఛానెళ్లలో యాంకర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. అనంతరం ప్రముఖ హీరోల ఇంటర్వ్యూలతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. ముఖ్యంగా ఒక స్టార్ హీరో సినిమా ప్రమోషన్ ఇంటర్వ్యూతో ఆమెకు భారీ పాపులారిటీ వచ్చింది. తర్వాత తెలుగు రియాలిటీ షో బిగ్ బాస్ నాన్-స్టాప్‌లో పాల్గొని ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. ప్రస్తుతం సినిమా ఆడియో లాంచ్‌లు, సెలబ్రిటీ ఇంటర్వ్యూలు, ప్రత్యేక కార్యక్రమాలకు హోస్ట్‌గా వ్యవహరిస్తూ బిజీగా ఉంది. ఇటీవల నటిగానూ తన ప్రయాణాన్ని ప్రారంభించిన స్రవంతి, సోషల్ మీడియాలో కూడా తన గ్లామరస్ ఫోటోషూట్లతో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంటోంది.

# మూడు సినిమాల నుంచి ఒక్కసారిగా తప్పించారు

## అర్ధరాత్రి ఏడ్చేశా: అనసూయ భావోద్వేగ వ్యాఖ్యలు

టెలివిజన్ యాంకర్‌గా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న అనసూయ భరద్వాజ్ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీ నటిగా కొనసాగుతున్నారు. యాంకర్‌గా వచ్చిన గుర్తింపును నటిగా విజయవంతంగా మలుచుకున్న అనసూయ, ఇప్పుడు వరుసగా సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. అయితే తన కెరీర్ ప్రారంభ దశలో ఎదుర్కొన్న ఒక బాధాకర సంఘటనను తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. కెరీర్ ప్రారంభంలో క్షణం, సోగ్గాడే చిన్ని నాయన వంటి చిత్రాల్లో అవకాశాలు రావడంతో నటిగా మంచి గుర్తింపు లభించిందని తెలిపారు. అయితే ఆమె కెరీర్‌లో నిజమైన మలుపు మాత్రం రంగస్థలం సినిమా ద్వారా వచ్చిందని చెప్పాలి. ఈ చిత్రంలో ఆమె పోషించిన 'రంగమ్మత్త' పాత్ర ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. సినిమా ఘన విజయం సాధించడంతో అనసూయకు నటిగా డిమాండ్ మరింత పెరిగింది. అయితే విజయాలతో పాటు వివాదాలు, సోషల్ మీడియా ట్రోలింగ్ కూడా తన జీవితంలో భాగమయ్యాయని అనసూయ తెలిపారు. తనపై జరిగే విమర్శలకు, ట్రోల్స్‌కు అవసరమైనప్పుడు గట్టిగానే సమాధానం ఇస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన కెరీర్‌లో జరిగిన ఒక బాధాకరమైన సంఘటనను గుర్తు చేసుకున్నారు. "ఒక సమయంలో మూడు క్రేజీ సినిమాల కోసం నన్ను ముందుగా ఎంపిక చేశారు. కానీ తర్వాత ఎలాంటి కారణం చెప్పకుండా ఆ ప్రాజెక్టుల నుంచి నన్ను తొలగించారు. ఎందుకు తీసేశారు? ఏం జరిగింది? అన్న విషయంపై కనీస వివరణ కూడా



ఇవ్వలేదు" అని అన్నారు.ఆ సంఘటన తనను తీవ్రంగా బాధించిందని అనసూయ వెల్లడించారు. "ఆ రోజు రాత్రి చాలా బాధేసింది. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో భర్త దగ్గర కూర్చొని వెక్కి వెక్కి ఏడ్చేశాను. ఆ బాధను జీర్ణించుకోలేకపోయాను" అని చెప్పారు. అలాగే తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని విషయాలపై కూడా సోషల్ మీడియాలో అనవసర చర్చలు జరిగాయని ఆమె తెలిపారు. నేను అప్పుడప్పుడు డ్రింక్ చేస్తాను. కానీ పరిమితంగానే తీసుకుంటాను. ఆ విషయాన్ని కూడా కొందరు వివాదంగా మార్చి సోషల్ మీడియాలో ట్రోల్ చేశారు అని పేర్కొన్నారు. అయితే ట్రోలింగ్ గురించి పెద్దగా పట్టించుకోనని, కాలక్రమంలో అలాంటి విషయాలను ఎదుర్కోవడం నేర్చుకున్నానని అనసూయ స్పష్టం చేశారు. "ఎవరు ఏమనుకున్నా, ఎన్ని ట్రోల్స్ చేసినా చివరికి నేను నా పనిని చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాను" అని ధైర్యంగా చెప్పారు.